# పీపుల్స్ న్యూస్ పత్రికకు అభినందనలు

**రంజాన్ విశిష్టతపై చక్కని కథనం**
**వెంకటాపూర్**

**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 19 ( పీపుల్స్ న్యూస్)**ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా, ఆ మాసం యొక్క ప్రాముఖ్యతను ఆధ్యాత్మిక విలువలను వివరిస్తూ పీపుల్స్ న్యూస్ పత్రిక ప్రచురించిన ప్రత్యేక కథనం ప్రశంసనీయం ముఖ్యంగా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సర్వర్ అహ్మద్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం శుభపరిణామం. ఉపవాస దీక్షలు (రోజా),ఖురాన్ పఠనం,దానగుణం (జకాత్) మరియు క్రమశిక్షణ వంటి అంశాలను ఈ కథనంలో చాలా స్పష్టంగా వివరించారు. సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తూ, పండుగల వెనుక ఉన్న అంతరార్థాన్ని పాఠకులకు అందించిన పీపుల్స్ న్యూస్ యాజమాన్యానికి విలేకరికి స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.


# మావోయిస్టు అగ్రనేత రాష్ట్ర కమిటీ నాయకుడు బడే చొక్కా రావు ఏ దామోదర్ కోసం పోలీసుల కూంబింగ్

**ములుగు,భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లో జల్లెడపడు తున్న పోలీసులు.**




**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 18 (పీపుల్స్ న్యూస్)**మేడారం అడవి ప్రాంతంలో బడే చొక్కారావు ఒదామోదర్ షెల్టర్ తీసుకున్నారన్న పక్క సమాచారంతో కూంబింగ్.ఇంటెలిజెన్స్ సమాచారంతో ములుగు, పస్రా,తాడ్వాయి, ప్రాంతాలలో ఐ హాలర్ట్ ప్రకటించిన పోలీసులు.మావోయిస్టు పార్టీ అగ్రనేత బడే చొక్కా రావు, ఒ దామోదర్ స్వస్థలం తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామం.భారీ బలగాల మోహరింపుతో ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాలలో యుద్ధ వాతావరణం నెలకొంది. చతిస్గడ్ రాష్ట్రం నుండి మావోయిస్టులను తెలంగాణ రాష్ట్రంలోకి రాకుండా పహార కాస్తున్న పోలీసులు. ప్రధాన రహదారులపై చెక్ పోస్టు ఏర్పాటు చేసి వాహనాల ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు.

# రామప్ప దేవాలయం ను సందర్శించిన ఫారెస్ట్ అధికారులు





**(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 19( పీపుల్స్ న్యూస్)** మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయం ను గురువారం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ లో శిక్షణ పొందుతున్న 41 మంది ఫారెస్ట్ అధికారులు డిసిఎఫ్ వో గంగారెడ్డి ఆధ్వర్యంలో రామప్ప దేవాలయాన్ని సందర్శించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ ఉమాశంకర్లు వారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను శిల్పకళ ప్రాముఖ్యతను టూరిజం గౌడ్ గోరంటల విజయ్ కుమార్ వివరించారు. అనంతరం వారు రామప్ప చెరువుతో పాటు పాలంపేట గ్రామ శివారులోని కేన్ మొక్కలను సందర్శించారు. వారి వెంట టూరిస్ట్ పోలిస్ లు శ్రీనివాస్, బద్రు, పారెస్ట్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# భూపాలపల్లి లో ఘోర రోడ్డు ప్రమాదం


**కమలాపూర్ క్రాస్ వద్ద రెండు బైకులు ఢీ**
**ఇద్దరు అక్కడికక్కడే మృతి**





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 18 (పీపుల్స్ న్యూస్)**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం శివారు కమలాపూర్ క్రాస్ వద్ద బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.గణపురం మండలం కేంద్రానికి చెందిన రెబ్బ శ్రీకాంత్ పని నిమిత్తం వెళ్లి తిరిగి భూపాలపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా భూపాలపల్లి మండలం నర్సింగాపూర్ కు చెందిన గాదె మహేష్ భూపాలపల్లి నుండి నరసింగాపూర్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. కాగా భూపాలపల్లి శివారు కమలాపూర్ క్రాస్ వద్ద ఎదురెదురుగా ఇరువురి వాహనాలు బలంగా ఢీకొనడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే భూపాలపల్లి ఎస్సై సాంబమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను వంద పడకల ఆసుపత్రి కి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందడంతో గణపురం, నరసింగాపూర్ గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# ఆలయ చైర్మన్ సంపత్ రావు కు అభినందనలు తెలిపిన మాజీ జెడ్పి టిసి వంగాల



**రేగొండ ప్రతినిధి,ఫిబ్రవరి19 (పీపుల్స్ న్యూస్ )** రేగొండమండలం కోటంచ ఆలయ నూతన చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన నాయినేని సంపత్ రావును శాయంపేట మాజీ జెడ్పిటిసి వంగాల రమాదేవి నారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ గా సంపత్ రావు గురువారం ప్రమాణ స్వీకారం అనంతరం బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శాయంపేట మాజీ జడ్పిటిసి రమాదేవి నారాయణరెడ్డిలు తమ మిత్రబృందంతో కలిసి సంపత్ రావును అభినందించారు. సంపత్ రావు నేపథ్యంలో ఆలయ అభివృద్ధి మరింత జరగాలని ఆ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రజలకు చల్లని ఆశీస్సులు లక్ష్మీ నరసింహ స్వామి కృపతో సంపత్ రావు కుటుంబ సభ్యులకు మరింత లబ్ది చేకూర్చాలని నారాయణరెడ్డి భగవంతుని ప్రార్థిస్తూ బోకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట పలువురు యువకులు నాయకులు, సంపత్ రావు అనుచరు లు కట్ల సదయ్య ఉన్నారు.

# కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించిన..

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య.**
**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.**
**స్వాగతం పలికిన ఎమ్మెల్యే గండ్ర**

**రేగొండ ప్రతినిధి ఫిబ్రవరి 19 (పీపుల్స్ న్యూస్)** భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వేర్వేరుగా సందర్శించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పునర్ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వేర్వేరుగా గురువారం ఆలయానికి రావడంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వారిని ఘనంగా స్వాగతించారు. కొడవటంచ గ్రామంలో ఈ నెల 21వ తేదీన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము పున:ప్రతిష్ఠాపన నేపథ్యంలో గురువారం ముందుగా ఆలయానికి చేరుకున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్థానిక శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ తో కలిసి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... రేగొండ మండలం కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని తెలంగాణలో రెండవ యాదాద్రిగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు



రూ. 12.15 కోట్ల భారీ నిధులతో పునరుద్ధరణ పనులు చేపట్టిందన్నారు. ఇటీవల ఫిబ్రవరి 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అభివృద్ధి పనులను, అతిథి గృహాన్ని ప్రారంభించారని తెలిపారు. యాదాద్రి తరహాలో కొడవటంచను తీర్చిదిద్ది, గ్రామీణ పర్యాటక రంగాన్ని, ఆర్థిక ప్రగతిని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యం అని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గండ్ర వెంట తిరిగి పరిశీలించారు. ముందుగా ఎమ్మెల్యే నాగరాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, మాజీ వరంగల్ డిసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ - వరద రాజేశ్వరరావు, మీడియా





ఇన్చార్జి మోడెం ఉమేష్ గౌడ్ , జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గూటోజు కిష్టయ్య, మాజీ సొసైటీ చైర్మన్ నడిపెల్లి విజన్ రావు, మాజీ జెడ్పిటిసి పత్తి ప్రభాకర్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోటంచలో నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

**ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో చైర్మన్ గా నాయినేని సంపత్ రావు.**

**రేగొండ ప్రతినిధి ఫిబ్రవరి 19 (పీపుల్స్ న్యూస్):**భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీఎస్సార్ హాజరయ్యారు. భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ చైర్మన్ సాంబారి సమ్మా రావు హాజరయ్యారు.ఈ దేవాలయం నూతన చైర్మన్గా నాయినేని సంపత్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సంపత్ రావు తో పాటు పాలకవర్గాన్ని ఎమ్మెల్యే వారికి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవాలయాలు భక్తి, ఆధ్యాత్మికతకు నిలయాలే కాకుండా సమాజానికి సాంస్కృతిక కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. నూతన పాలక వర్గం సభ్యులు ఐక్యంగా పనిచేసి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.అలాగే భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నూతన కమిటీగా నియమితులైన పాలకవర్గాన్ని ఆలయ ఈవో మహేష్ చే



ప్రమాణస్వీకారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ సాంబారి సమ్మరావు, జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గూటోజు కిష్టయ్య, స్థానిక సర్పంచ్ చావటి మొగిలి, భూపాల్ పల్లి జిల్లా సీనియర్ నాయకుడు మీడియా ఇన్చార్జి మోడెం ఉమేష్ గౌడ్ , ఇప్పకాయల నరసయ్య, సొసైటీ మాజీ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, ఎర్రబెల్లి రవీందర్ రావు,రేగొండ మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, మాజీ ఆలయ చైర్మన్లు కుందూరు రవీందర్ రెడ్డి, ముల్కనూరు బిక్షపతి,సూరం వీరేందర్, మటిక సంతోష్, ఓం ప్రకాష్, నడిపెల్లి వెంకట్రావు, పాత పెల్లి సంతోష్, దుగ్యాల రాజేశ్వరరావు,తోకల సురేందర్ రెడ్డి, గడ్డం వెంకటస్వామి, ముడుతనపల్లి శంకరయ్య, బోజ్జం రవి, కాటం సాదయ్య,టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, సాబీర్, మాటూరు తిరుపతి గౌడ్, పంచాయతీ కార్యదర్శి లు అమూల్య, జీవిత, కనుకుంట్ల వంశస్థులు కనుకుంట్ల దేవేందర్ రావు, జోగేందర్ మాజీ సర్పంచ్ పబ్బ శ్రీనివాస్ గౌడ్ వీర






చంద్రం కాకర్ల పల్లె సర్పంచ్ అబ్బర బోయిన మీనా సురేష్ పొనగల్లు సర్పంచ్ మామిడి శెట్టి రవీందర్ లింగాల సర్పంచ్ మొర్రి సురేష్ ,వారణాసి అజయ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల మల్లయ్య,జున్ను సురేష్, తదితరులు ఆలయ సిబ్బంది గోరంట్ల శ్రావణ్, కొమ్రు రాజు రవి, సుధాకర్, నాగుల సుదర్శన్, బోస్ రవి, ఉమ్మడి మండల కాంగ్రెస్ శ్రేణులతో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణకు గురైన నీర్ల చెరువు...
# అధికారుల మౌనం ఎందుకు?






**కుత్బుల్లాపూర్: ఫిబ్రవరి 19 (పీపుల్స్ న్యూస్)** కుంటలు, చెరువులను సంరక్షించి భూగర్భ జలాలను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బహుదూర్‌పల్లిలో ఉన్న నీర్ల చెరువు ఆక్రమణకు గురవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకప్పుడు నీటితో కళకళలాడిన ఈ చెరువు ప్రస్తుతం కొందరు బడాబాబుల కబ్జాలోకి వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. చెరువు నడుముగా రహదారి వేసి, అనంతరం భూభాగాన్ని ఆక్రమించుకున్నారని స్థానికులు చెబుతున్నారు.ప్రభుత్వ భూములలో నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.చెరువులు నిండితేనే భూగర్భ జలాలు పెరుగుతాయి, పరిసర ప్రాంతాలకు నీటి కొరత ఉండదు. అయితే ఇలాంటి సహజ వనరులు ఆక్రమణకు గురవడం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెరువును రక్షించాల్సిన అధికారులే మౌనం వహించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే స్పందించి చెరువును ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల సహకారంతో భూముల కబ్జా?**

బహుదూర్‌పల్లి ప్రాంతంలో ఉన్న నీర్ల చెరువు పరిసర ప్రాంతాలను కొందరు ప్రభావశీలులు ఆక్రమించుకున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. చెరువు చుట్టూ రేకులు వేసి, ప్రహరీ గోడలు నిర్మించడంతో పాటు బహుళ అంతస్తుల



భవనాల నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి చెందిన భూములను అక్రమంగా స్వాధీనం చేసుకుని దర్జాగా వినియోగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.స్థానికుల సమాచారం ప్రకారం, ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా ఉండటం అనుమానాలకు తావిస్తోంది. కొందరు అధికారులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. చెరువు భూములు ఆక్రమించబడటంతో భవిష్యత్తులో వరద ముప్పు పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, చెరువు ఆక్రమణలను వెంటనే తొలగించి అసలు రూపాన్ని పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారా అనే దానిపై అందరి దృష్టి నిలిచింది.

**కుంట స్థలాన్ని హైడ్రా ఆధీనంలోకి తీసుకోవాలి.**

బహుదూర్ పల్లి లోని నిర్ల చెరువు స్థలం ఆక్రమణలకు గురై నిర్లక్ష్యానికి లోనవుతుండడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంట పరిసర ప్రాంతాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసి నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని ప్రజలు కోరుతున్నారు.కుంటను కబ్జా రాజుల నుండి విడిపించి ఎప్పటిలాగే కుంటను బాగుచేయాలని కోరుతున్నారు. కుంటను తక్షణమే సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకుని పూడిక తొలగింపు పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు. అలాగే కబ్జాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి కుంటను శుభ్రపరిచి నీటి వనరును సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. కుంట పునరుద్ధరణ జరిగితే భూగర్భ జలాలు పెరగడంతో పాటు పరిసర ప్రాంతాలకు పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

